బ్యాలెట్ బాక్సుల తరలింపును పరిశీలిస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్

ఎమ్మెల్సీ బ్యాలెట్ బాక్సుల పరిశీలన

మామిళ్లగూడెం, మే 17: శాసన మండలి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు వచ్చిన బ్యాలెట్ బాక్సులను జడ్పీ కార్యాలయ భవనం ఆవరణలోని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. వీటిని ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ శుక్రవారం పరిశీలించారు. ఎన్నికల కేంద్రాలకు వీటి పంపిణీ, పోలింగ్ అనంతరం నల్గొండలోని కేంద్రానికి తరలింపు ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఆర్టీసీ బస్సులో ఎన్ని బాక్సులు పడతాయో, ఎంతమంది సిబ్బంది వెళ్లవచ్చో ప్రత్యక్షంగా పరిశీలించారు. అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ శ్రీలత, ఖమ్మం ఎంపీఐ వెంకటరమణ, ఆర్టీసీ ఖమ్మం డిపో మేనేజర్ శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కేసుల పురోగతికి పటిష్ట చర్యలు: కల్లూరు ఏసీపీ

మాట్లాడుతున్న ఏసీపీ రఘు

సత్తుపల్లి టౌన్, మే 17: నేర పరిశోధనలో కేసుల పురోగతికి చర్యలు చేపట్టాలని కల్లూరు ఏసీపీ అనిశెట్టి రఘు అన్నారు. స్థానిక ఏసీపీ కార్యాలయంలో శుక్రవారం డివిజన్‌లోని పోలీస్ అధికారులతో నేరాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇన్విస్టిగేషన్ కేసులో పరిష్కారానికి పలు సూచనలు చేశారు. డివిజన్‌లో రోడ్డు ప్రమాదాలు నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌ను కట్టడి చేయాలని స్పష్టం చేశారు. లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా కృషిచేయాలని సూచించారు. సమావేశంలో సీఐలు కిరణ్, వెంకటేశం, వీరప్రసాద్, వెంకటేశ్, షాకీర్ పాల్గొన్నారు.

'సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలకు చెక్'

సీసీ కెమెరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

తిరుమలాయపాలెం, మే 17: గ్రామాల ప్రధాన వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా నేరాలను అరికట్టవచ్చని స్థానిక ఎస్ఐ.గిరిధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వెదుళ్లచెరువులో సీసీ కెమెరాల ఏర్పాటుపై శుక్రవారం సాయంత్రం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సీసీల ఏర్పాటుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన దినోత్సవం

సత్తుపల్లి టౌన్, మే 17: పట్టణంలోని విరాట్‌నగర్‌లోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆరాధన దినోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మట్టా రాగమయి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **మణుగూరు బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిష్టర్ తనఖా చేయించుకొని **మాలోత్ వసంత** W/o : **కిషన్, వయస్సు** : 30సం||లు, వృత్తి : గృహిణి, **నివాసం**: ఇ.నెం. 1-1-146/2, అశోక్‌నగర్, బండారుగూడెం, మణుగూరు, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **5** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : ఖమ్మం జిల్లా అశ్వారావుపేట రిజిష్ట్రారు మరియు కూసుమంచి సబ్ రిజిష్ట్రారు వారి అధికార పరిధిలోని, ఖమ్మం జిల్లా, తిరుమలాయపాలెం రెవిన్యూ మండలం, దమ్మాయిగూడెం గ్రామపంచాయితీ పరిధిలోని తెట్టెలపాడు రెవిన్యూ గ్రామములోని సర్వే నెంబర్లు : 292/అ1, 292/అ2 అన్ని నెంబర్లు మింజుమలే నివేశన ఖాళీ స్థలము, **డాక్యుమెంట్ నెం. 9032/2014** ప్లాటు నెంబర్లు : 183 & 184 (Each Plot Area : 166-66 Sq.yards) వెరశి ఏకఖండములుగా రెండు ప్లాట్ల మొత్తం విస్తీర్ణము : 333-32 చ||గ||= 278-68 చ||మీ|| గలట్టి ఈ విక్రయాస్తికి సరిహద్దులు : **తూర్పు** : 30 అడుగుల వెడల్పు గల ప్రపోజుడ్ రోడ్డు, **పడమర** : ప్లాటు నెం. 163 & 164, **ఉత్తరం** : ప్లాటు నెం. 182, **దక్షిణము** : ప్లాటు నెం. 185.

పలివెల గణేష్ బాబు
అడ్వకేట్, కొత్తగూడెం.
సెల్ : 9849246278

భుక్యా మాన్‌సింగ్ సంస్మరణ సభ

కొణిజర్ల, మే 17: మండల పరిధిలోని విక్రమ్‌నగర్‌లో సీపీఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ గ్రామ సీనియర్ నాయకుడు భూక్యా మాన్‌సింగ్ సంస్మరణ సభను శుక్రవారం నిర్వహించారు. ముందుగా స్థూపావిష్కరణను అరుణోదయ సంస్కృతి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు నాగన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సంస్మరణ సభలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర నాయకులు విప్లవ్‌కుమార్, సీపీఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ వైరా సబ్‌డివిజన్ కమిటీ కార్యదర్శి ఎస్.కే.ఖాసీం మాట్లాడుతూ.. మాన్‌సింగ్ సేవలను కొనియాడారు. ఎస్.కే.ఉమర్, పరకాల లక్ష్మి, గుగులోతు బాబు, ఇస్లావత్ కృష్ణ, ధరావత్ మంగయ్య, లకావత్ బాసు, ఇస్లావత్ శ్రీనుధరం సోత్ పుల్‌సింగ్, ధరావత్ లాల్, బాణోతు సామిని, ధరావత్ సూర, ఇస్లావత్ బాజు తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

CHANGE OF NAME

* I, **BODDU ANJANEE DEVI** CHANGED MY NAME AS **BODDU ANJANI DEVI,** W/o. BODDU VENU PRASAD, R/o. H.NO: 4-2-14/0, SCB NAGAR, RAMAVARAM KOTHAGUDEM-507 118, BK DIST.

KMM-

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రామాలయ స్వర్ణోత్సవ ఆహ్వానపత్రిక ఆవిష్కరణ

సత్తుపల్లి టౌన్, మే 17: పట్టణంలోని కోదండ రామాలయంలో ఈ నెల 22 నుంచి జరిగే స్వర్ణోత్సవ వేడుక (50వ వార్షికోత్సం)లో భాగంగా శుక్రవారం ఆహ్వానపత్రికను నిర్వాహకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమిటీ బాధ్యులు అనుమోలు సురేష్, గుడిమెట్ల గాంధీ, తోట రమేష్, మొరిశెట్టి సాంబ తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక **నమస్తే తెలంగాణ**

నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు

సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు

సెల్ : 9182777616

జన హితమే లక్ష్యంగా పనిచేస్తా

న్యాయవాదుల సమావేశంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి

ఖమ్మంలో న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి

ఖమ్మం, మే 17: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే జన హితమే లక్ష్యంగా పనిచేస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి అన్నారు. ఖమ్మం బైపాస్ రోడ్డులోని ప్రైవేట్ హోటల్‌లో శుక్రవారం న్యాయవాద జేఏసీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు బిచ్చాల తిరుమలరావు అధ్యక్షతన న్యాయవాదులతో జరిగిన ఆత్మీయ సమావేశంలో నుగుల మాట్లాడారు. కేసీఆర్ విధానాలు, పాలనాదక్షతతో ప్రభావితుడనయ్యానని, అందుకే బీఆర్ఎస్‌లో చేరానని అన్నారు. పెద్దల సభకు వెళ్లాల్సింది మేధావులేగానీ, మోసగాళ్లు కాదని అన్నారు. తాను బిట్స్ పిలానిలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినట్లు, అమెరికాలో ఏడేళ్లపాటు ఉన్నట్లు తెలిపారు. జన్మ భూమి రుణం తీర్చుకునేందుకు 2013లో రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ఆ రోజు నుంచి ఈ రోజు వరకు ప్రజా సమస్యలపై పోరాడుతున్నానని అన్నారు. గతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీలుగా చుక్కా రామయ్య, ప్రొఫెసర్ నాగేశ్వర్, రాజు, రామచందర్‌రావు, డాక్టర్ నాగేశ్వరరావు, దిలీప్‌కుమార్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి వంటి మేధావులు ఎన్నికయ్యారని చెప్పారు. ఈ వరుసలోనే తనను ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు. తాను గెలిస్తే, ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుకగా నిలుస్తానని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలిచినా ఉపయోగం ఉండదని, సీఎం రేవంత్ ను ప్రశ్నించలేడని అన్నారు. మెగా డీఎస్సీ, నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలండర్, ఉద్యోగుల డీఏ, పీఆర్సీ వంటి అనేకానేక అంశాలపై మండలిలో ప్రశ్నిస్తానని అన్నారు. తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ.. కేసీఆర్ ఆశీస్సులతో పోటీ చేస్తున్న రాకేష్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్న మోసగాడని, ఆయనకు ఓటు వేస్తే వృథా అవుతుందని అన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరళ్ల శ్రీనివాస్, న్యాయవాది వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు ఆర్‌జేసీ కృష్ణ, పగడాల నాగరాజు, బొమ్మెర రామ్మూర్తి, డోకుపర్తి సుబ్బారావు, పగడాల నరేందర్, మేకల సుగుణారావు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓట్ల వేట షురూ..

పెనుబల్లి, మే 16: ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఓట్ల కోసం పలు పార్టీలు ప్రయత్నాలు మొదలు పెట్టారు. జాబితా తయారు చేసి పట్టభద్రుల వివరాలను సేకరిస్తూ ముందుగానే వారి మొదటి ఓటు ప్రాధాన్యతను వివరించాలనే ఆలోచనతో ఆయా గ్రామాల నాయకులు సమాలోచనలు మొదలు పెట్టారు. దీంతో పట్టభద్రుల ఓట్ల హడావిడి గ్రామస్థాయిలో ప్రారంభమైంది.

సింగరేణి వైద్య శిబిరం

సత్తుపల్లి, మే 17: మండలంలోని కిష్టారం ఓసీ ప్రభావిత ప్రాంతమైన చెరుకుపల్లిలోని ఆర్అండ్ఆర్ సెంటర్ ప్రాథమిక పాఠశాలలో సింగరేణి ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కిష్టారం పీవో నర్సింహారావు ప్రారంభించారు. వైద్యులు శిరీష శిబిరానికి వచ్చిన ప్రజలకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సంక్షేమాధికారి సందీప్, మాజీ సర్పంచ్ ఇర్పా లలిత, మొగిలి నగేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముదిగొండ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా కరుణాకర్‌రెడ్డి

ఇన్‌చార్జ్ తహీల్దార్ కరుణాకర్‌రెడ్డి

ముదిగొండ, మే 17: ముదిగొండ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా కరుణాకర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ వై రామారావుకు ఆరోగ్య సమస్యలతో సెలవులో ఉండగా కరుణాకర్ రెడ్డిని ఇన్‌చార్జ్‌గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకూ కరుణాకర్‌రెడ్డి ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా కొనసాగనున్నారు.

తీన్మార్ మల్లన్నను అనర్హుడిగా ప్రకటించాలి

- 4.61 లక్షల గ్రాడ్యుయేట్లను ఆయన ఎమోషన్ బ్లాక్‌మెయిల్ చేశారు
- కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ రెబల్ అభ్యర్థి బక్కా జడ్సన్
- ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నా.. అదనపు కలెక్టర్‌కు వినతి

మల్లన్నను అనర్హుడిగా ప్రకటించాలంటూ ఐడీవోసీలో అదనపు కలెక్టర్ ఎదుట భీష్మించిన జడ్సన్

మామిళ్లగూడెం, మే 17: ఖమ్మం – వరంగల్ – నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌కుమార్‌ను అనర్హుడిగా ప్రకటించాలని ఆ పార్టీ ఎమ్మెల్సీ రెబల్ అభ్యర్థి బక్కా జడ్సన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జడ్సన్ మాట్లాడుతూ.. మూడు ఉమ్మడి జిల్లాలోని 4.61 లక్షల గ్రాడ్యుయేట్ ఓటర్లను బ్లాక్‌మెయిల్ చేసిన తీన్మార్ మల్లన్నను ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనర్హుడిగా ప్రకటించకుంటే నల్గొండ కలెక్టరేట్ దగ్గర నిరాహార దీక్ష చేపడతామని అన్నారు. ఈ నెల 15న తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ సన్నాహక సభలో మలన్న మాట్లాడుతూ 'నన్ను శాసన మండలికి పంపుతారా?, లేకుంటే శ్మశానానికి పంపుతారా?' అంటూ పట్టభద్రులను ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేశారని ఆరోపించారు. దీనిపై తాను ఎన్నికల సంఘానికి, ఇతర అధికారులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ నెల16న ఖమ్మం అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో ఇప్పుడు ఇక్కడ దీక్షకు దిగినట్లు చెప్పారు. మల్లన్నను గెలిపించడానికి సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ ద్వారా కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్న అశోక్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేయిస్తున్నారని ఆరోపించారు. తాను ఎమ్మెల్సీగా పోటీచేయాలనుకుంటున్న తనకు మద్దతుగా ఉన్న 46 జీవో బాధితులు, గ్రూప్స్ నిరుద్యోగుల ఓట్లు చీల్చడానికి ఆయనను రంగంలో దించారని విమర్శించారు. కాగా, ఆందోళన చేస్తున్న జడ్సన్ వద్దకు ఏఆర్‌వో మధుసూదన్‌నాయక్ వచ్చి మాట్లాడారు. జడ్సన్ ఫిర్యాదును ఎన్నికల సంఘానికి పంపించామని చెప్పడంతో ఆందోళన విరమించారు. అయితే, శుక్రవారం సాయంత్రం వరకు తీన్మార్ మల్లన్న పోటీపై చర్యలు తీసుకోకుంటే శనివారం నల్గొండ రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయం ముందు నిరాహార దీక్ష చేపడతానని జడ్సన్ స్పష్టం చేశారు.

కొనసాగుతున్న లారీ యజమానుల ఆందోళనలు

వంటా వార్పుతో ఐదోరోజు వినూత్న నిరసన

వంటావార్పుతో నిరసన తెలుపుతున్న లారీ యజమానుల సంఘం నేతలు

సత్తుపల్లి టౌన్, మే 17: ఐదు రోజుల నుంచి సత్తుపల్లి ప్రాంతంలోని సింగరేణి బొగ్గు గనుల రవాణా తమకు ఇవ్వాలంటూ లారీ యజమానులు చేపట్టిన ఆందోళన శుక్రవారం కొనసాగింది. మండల పరిధిలోని కిష్టారం లారీ అసోసియేషన్ భవనం వద్ద బొగ్గు రవాణా తమకు ఇవ్వాలంటూ చేపట్టిన ఆందోళనలో భాగంగా లారీ యజమానులు వంటా వార్పుతో వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లారీ యజమానుల సంఘం బాధ్యులు మాట్లాడుతూ.. కొత్తగూడెనికి రోడ్డు మార్గం ద్వారా రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ రవాణాను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేవరకు ఆందోళన కార్యక్రమాలు జరుగుతూనే ఉంటాయని హెచ్చరించారు. గురువారం రాత్రి తమ పిల్లలతో లారీ యజమానులు జీఎం కార్యాలయాన్ని ముట్టడించడంతో ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ కార్యాలయం వద్దకు వెళ్లి సింగరేణి యాజమాన్యానికి లారీ యజమానులకు మధ్య సయోధ్య కుదిర్చేలా మాట్లాడినప్పటికీ లారీ యజమానులు ఒప్పుకోకపోవడంతో ఆందోళన యథావిధిగా కొనసాగింది. కొండపల్లి రమేష్‌రెడ్డి, పీఎల్.ప్రసాద్, కోటిరెడ్డి, షేక్ కిజర్, నజీర్‌బాబు, షేక్ లియాఖత్, ఐ.శ్రీనివాసరావు, మునీర్, కోట మోహనరావు, సూరిబాబు, వేముల విశ్వనాథం, మౌలాలి, దాసు, మిరియం మధు, మస్తాన్, అన్వర్, రెహమాన్, చెరుకుపల్లి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

పరిశ్రమల యజమానులతో సంప్రదిస్తున్నాం: కిష్టారం పీవో

సత్తుపల్లి ప్రాంతంలో బొగ్గు గనుల రవాణా విషయంలో లారీ యజమానులు ఆందోళన చేయడం సింగరేణి సంస్థ లోపం కాదని సింగరేణి పీవో నర్సింహారావు అన్నారు. సత్తుపల్లి కిష్టారం బొగ్గు గనుల్లో 13లక్షల టన్నుల బొగ్గు నిలిచిపోయిందని, నిలిచిపోయిన బొగ్గు నిల్వలను పవర్ ప్రాజెక్టులకు తరలించేందుకు కొత్తగూడెం రుద్రంపూర్ కోల్ హ్యాండలింగ్ ప్లాంట్‌కు తరలించేందుకు సంస్థ నిర్ణయం తీసుకుందన్నారు. ఈ కాంట్రాక్టు మూడు నెలల్లో పూర్తవుతుందని, సమస్య పరిష్కారమవుతుందని ఆయన విలేకరులకు వివరించారు.

మత్స్యకారులకు అవగాహన సదస్సు

మాట్లాడుతున్న మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు

వైరాటౌన్, మే 17: వైరా మున్సిపాలిటీ పరిధిలోని లాలాపురం గ్రామంలో మత్స్యశాఖ, మత్స్య సొసైటీ ఆధ్వర్యంలో మత్స్యకారులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు రహీం మాట్లాడుతూ.. మత్స్యకారుల కుటుంబాల పిల్లలు అన్ని రంగాల్లో ముందుండాలని, ప్రతిఒక్క మత్స్యకారుడు తమ యొక్క సభ్యత్వాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. వైరా చెరువులో నీళ్ళు తక్కువగా ఉన్నందున చేపల వేట కుదరదని, జూన్ మొదటి వారంలో చేపల వేటకు అందరూ సిద్ధంగా ఉండాలని సభ్యులందరికి సూచించారు. కార్యక్రమంలో మత్స్య సహకార సంఘ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రపంచ అధిక రక్తపోటు దినోత్సవం

ఎర్రుపాలెం, మే 16: మండలంలోని నారాయణపురం పల్లెదవాఖానాలో ప్రపంచ రక్తపోటు దినోత్సవ ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యురాలు శకుంతల మాట్లాడుతూ.. అసంక్రమిత వ్యాధుల్లో అధిక రక్తపోటు ప్రపంచ వ్యాప్తంగా అత్యధికంగా మరణాలకు కారణమవుతుందని, తలనొప్పి, వాంతులు, ఛాతీలో నొప్పి, గుండె వేగంగా కొట్టుకోవడం, దృష్టి మసక బారడం, మెడనరాల నొప్పి వంటివి సూచనలు ఉంటాయన్నారు. నిర్లక్ష్యం వహిస్తే గుండెపోటు, పక్షవాతం, మూత్రపిండ వ్యాధులు, చూపు కోల్పోవడం, మానసిక సమస్యలకు దారి తీస్తాయన్నారు. పల్లె దవాఖానా వైద్యురాలు శకుంతల, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తల పాల్గొన్నారు.

రేపు సత్తెనపల్లి రామకృష్ణ భవన్ ప్రారంభం

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు నున్నా నాగేశ్వరరావు

కమాన్‌బజార్, మే 17: విద్యుత్ ఉద్యమ అమరుడు సత్తెనపల్లి రామకృష్ణ పేరుతో నగరంలోని ఇందిరానగర్ సెంటర్‌లో నిర్మించిన సీపీఐ(ఎం) ఖానాపురం హవేలీ కమిటీ నూతన కార్యాలయ భవనాన్ని ఆదివారం ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. పార్టీ జిల్లా కార్యాలయమైన సుందరయ్య భవన్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఆదివారం సాయంత్రం 6 గంటలకు సత్తెనపల్లి రామకృష్ణ భవన్‌ను కేరళ రాష్ట్ర మాజీ ఆరోగ్య శాఖ మంత్రి, పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలు కేకే శైలజ టీచర్ ప్రారంభిస్తారని చెప్పారు. ఈ భవన్‌ను కేవలం పార్టీ కార్యకలాపాలకే పరిమితం చేయకుండా, విద్య–వైద్య కేంద్రంగా సేవలందించేలా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు.

'సన్న వడ్లకే బోనస్' సరికాదు

సన్న రకం ధాన్యానికే రూ.500 బోనస్ ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం సరికాదని నున్నా నాగేశ్వరరావు అన్నారు. దాదాపు 80 శాతం ధాన్యం దొడ్డు రకాలే ఉంటాయని అన్నారు. ఏ రకమైన ధాన్యానికైనా బోనస్ ఇవ్వాల్సిందేనని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్షానికి దెబ్బతిన్న ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు యర్రా శ్రీకాంత్, బుగ్గవీటి సరళ, వై.విక్రమ్, తిరుపతిరావు పాల్గొన్నారు.

పంటపొలాల్లో అవశేషాలను కాల్చొద్దు: ఏవో

పొలంలో రైతులకు సూచనలిస్తున్న ఏవో నాగేశ్వరరావు

ఖమ్మం రూరల్, మే 17: పంటపొలాల్లో అవశేషాలను తగులబెట్టొద్దని ఏవో వీ.నాగేశ్వరరావు రైతులకు సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని గుదిమళ్లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట కోతలు పూర్తైన తరువాత మిగిలిన అవశేషాలను తగులబెట్టవద్దన్నారు. పంట వ్యర్థాలను వర్షం పడిన అనంతరం భూమిలో కలియదున్నుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి: గోకినేపల్లి

వైరాటౌన్, మే 17 : జిల్లాలో అకాల వర్షంతో పంటలు, కూరగాయలు, పండ్లు తోటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వైరాలోని విక్రమ్‌భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో 11 మండలాల్లో 548మంది రైతులకు చెందిన 2000 ఎకరాల్లో మామిడి తోటలు, బొప్పాయి తోటలు దెబ్బతిన్నాయని, ఇండ్ల రేకుల షెడ్లు కుప్పకూలాయని, విద్యుత్ తీగలు వ్రేలాడడం వల్ల పశువులు మృతిచెందాయని అన్నారు. మే 19, 20 తేదీల్లో వైరాలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఖమ్మంజిల్లా రాజకీయ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు సీవై పుల్లయ్య, పార్టీ వైరా డివిజన్ కార్యదర్శి కె.అర్జున్‌రావు, పార్టీ వైరా మండల కార్యదర్శి యలదండి బాబు పాల్గొన్నారు.

నేడు జిల్లాలో పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం

మామిళ్లగూడెం/ ఖమ్మం రూరల్/ చింతకాని/ సత్తుపల్లి/ వేంసూరు, మే 17: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహణ పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయా డివిజన్లు, మండలాల విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఖమ్మం దానవాయిగూడెం, రఘునాథపాలెం, ఖానాపురం హవేలీ, ఇల్లెందు క్రాస్ రోడ్, ఖమ్మం టౌన్–5, సత్తుపల్లి ఐపీడీఎస్, వేంసూరు మండలం కందుకూరు సబ్ స్టేషన్ల పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, బుర్హాన్‌పురం సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, మమత ఆసుపత్రి సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, ధంసలాపురం సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం పెద్దతండా, ఏదులాపురం పంచాయతీల్లో ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు, చింతకాని మండలం చింతకాని, నాగులవంచ ఉప కేంద్రాల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వివరించారు.

'పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం'

నేలకొండపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

కూసుమంచి (నేలకొండపల్లి), మే 17: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటారని, అందుకు ప్రతిఒక్కరూ నీటి నిల్వలు లేకుండా చెత్త మురుగు నీటిని ఎప్పటికప్పుడు తీసి వేయాలని వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్ అన్నారు. నేలకొండపల్లిలో వ్యాధుల నివారణపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రతిఒక్కరూ ఇండ్లు శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. డెంగీ నివారణకు టీకాలు వేసుకోవాలని ఆశాలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది వద్ద మందులు ఇంజక్షన్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో దుర్గ, డీపీఎంవో సంధ్య, హెచ్‌ఈవోలు చంద్రశేఖర్, వీరన్న, పీహెచ్ఎన్ తిరుమలమ్మ, సూపర్‌వైజర్లు తిరుపతమ్మ, శ్రీలక్ష్మీ, ఏడుకొండలు పాల్గొన్నారు.

విత్తనాలు కొనేప్పుడు జాగ్రత: ఏవో

ఏవో బాలాజీ

కొణిజర్ల, మే 16: విత్తనాలు తీసుకునేటప్పుడు తప్పనిసరిగా లైసెన్స్ కలిగిన విత్తన దుకాణాల వద్దనే విత్తనాలు కొనాలని మండల వ్యవసాయాధికారి బాలాజీ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. గుడ్డ సంచులు, ప్యాకింగ్ లేకుండా, కంపెనీ పేరు లేకుండా విత్తనాలు ఎక్కువ దిగుబడి వస్తాయని చెబితే నమ్మి తీసుకోవద్దని, లైసెన్స్ కలిగిన విత్తన దుకాణాల వద్ద నుంచే విత్తనాలు తీసుకోవాలన్నారు. కొన్ని కంపెనీలు మా విత్తనాలు వేస్తే నారుకుళ్లుడు రాదని, వేరే కుళ్లుడు రాదని ప్రచారం చేసి వారి కంపెనీ విత్తనాలను అమ్ముకుంటున్నారని తెలిపారు. మోసకారి కంపెనీల మాయ మాటలను నమ్మి విత్తనాలు కొని రైతు నష్టపోవద్దని కోరారు.

ముమ్మరంగా పొలం పనులు

వారం రోజులుగా వర్షపు జల్లులు కురవడంతో రైతన్నలు ముందుగానే దుక్కులు దున్నేందుకు సిద్ధమయ్యారు. మరికొద్ది రోజుల్లో వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ వెల్లడించడంతో భూమి పదును చేసేందుకు దుక్కులు ఉపయోగపడతాయని దుక్కులు ప్రారంభించామని రైతులు తెలిపారు. –పెనుబల్లి, మే 16